

నిండు పున్నమి.. వెలుగు

చుట్టూ చీకటి.. మధ్యలో నిండు పున్నమి వెలుగు.. గురువారం రాత్రి గురుపౌర్ణమి కావడంతో చంద్రుడు ఇలా కనిపించి కనివిందు చేశాడు..

-ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఘనంగా గురుపౌర్ణమి



కాకినాడ టూటౌన్‌లో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

జిల్లాలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. పలువురు తమ గురువులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా మందిరాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

చాగంటిని కలిసిన మాధవ్

సర్పవరం జంక్షన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం కాకినాడ రూరల్‌లోని తిమ్మాపురంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎథిక్స్ కమిటీ సలహాదారు చాగంటి కోటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చాగంటి చిత్రపటాన్ని ఆయనకు మాధవ్ బహూకరించి ఆయన ఆశీస్సులు స్వీకరించారు.



కాకినాడలో జరిగిన మెగా పేరెంట్-టీచర్స్ ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే కొండబాబు



సామర్లకోటలో విద్యార్థికి పుస్తకం అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

విజయవంతంగా మెగా పీటీఎం 2.0

- పాఠశాలలు, కళాశాలలకు తరలివచ్చిన తల్లిదండ్రులు
- విద్యార్థుల విద్య, ఆరోగ్య పరీక్షల వివరాలు అందజేత



కాకినాడ పీఆర్ కళాశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పాఠశాల ప్రగతిలో భాగస్వాములను చేస్తూ విద్యార్థుల ప్రగతి, ఆరోగ్య పరీక్షల వివరాలను తెలియజేస్తూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు సందడి వాతావరణంలో సాగాయి.జిల్లాలోని 1260 ప్రభుత్వ, 598 ప్రైవేటు, 20 ఎయిడ్ పాఠశాలల్లో 2,78,932మంది విద్యార్థులు చదువుతుండగా, 141 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 45,344మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి మెగా పీటీఎం కార్యక్రమం చక్కని వేదిక అని కలెక్టర్ అన్నారు. కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకినాడ రూరల్ మండలం తూరంగి జెడ్పీ ఉన్నతపాఠశాల, తాళ్లరేవు మండలం తాళ్లరేవులోని నామన వెంకయమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం 2.0 కార్యక్రమాల్లో కలెక్టర్ ప్రజాప్రతినిధులతోకలిసి పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి అద్భుత వేదిక మెగా పీటీఎం 2.0 నిలుస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. కాకినాడ జగన్నాథపురం ఎంఎస్ఎన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల డిజిటల్ సెమినార్ హాలులో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన గురువారం జరిగిన మెగా పేరెంట్స్ లెక్చరర్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాల్లో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు. జగ్గంపేటలో జరిగిన మెగా పీటీఎం 2.0 కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరడం తల్లిదండ్రుల ఆకాంక్ష అని అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని పలు మండలాల్లోని స్కూళ్లల్లో జరిగిన మెగా పీటీఎం వేడుకల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీకి సహకారం అందించాలి

- జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కలెక్టరేట్(కాకినాడ),జూలై10(ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలలో జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించి జిల్లాలో పరిశ్రమల యాజమాన్యం తమవంతు సహకారం అందించాలని జేసీ రాహుల్‌మీనా కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఆయన పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుశాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 12వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీకి రోజుకు 800 నుంచి వెయ్యి మంది వరకు హాజరవుతారన్నారు. క్రీడాకారులకు అల్పాహారం, భోజనం, ఇతర సదుపాయాలు కల్పించడానికి జిల్లాలో పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యత కింద తమవంతు సాయం చేయాలన్నారు. సమావేశంలో సీపీవో త్రినాథ్, పరిశ్రమలశాఖ జీఎం గణపతి, ఏడీ విజయ్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు దమ్ముంటే రండి.. అభివృద్ధి చూపిస్తాం

- పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూలై10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో తాను పెద్దాపురం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూపిస్తా, దమ్ము ధైర్యం ఉంటే స్వయంగా కళ్లు పెట్టి చూడండి అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వైసీపీ నాయకులను నిశితంగా విమర్శించారు. సామర్లకోట టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను చేసిన అభివృద్ధిపై తప్పుడు కామెంట్లు చేయడం స్థానిక వైసీపీ ఇన్‌చార్జి నాయకుడికి తగ దన్నారు. తరచూ అమెరికా ట్రిప్‌లకు వెళ్తూ హాలిడే రాజకీయాలు చేస్తున్న వైసీపీ ఇన్‌చార్జి తనను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎప్పుడూ నియోజకవర్గానికే అంటిపెట్టుకుని నిరంతర అభివృద్ధికి పాటుపడుతున్న తనను విమర్శిస్తే అతడి గుట్టు బహిర్గతం చేస్తానని హెచ్చరించారు. అమెరికా వెళ్లి ఎక్కడెక్కడ డ్యాన్సుల్లో పాల్గొన్నావో ఆ వీడియోలన్నీ తనవద్ద ఉన్నాయన్నారు. కోవూరు మహిళా ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే నల్లప రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఆయన వెంట కంటే జగదీష్‌మోహన్, అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు లు పాల్గొన్నారు.

దత్తనామస్మరణతో మార్మోగిన పిఠాపురం

- భక్తజనసంద్రమైన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని దత్తబృందావనంలో లక్షగులాబి, తులసి అర్చన

పిఠాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని దత్తక్షేత్రాలు, సాయిబాబా ఆలయాలకు భక్తులుపోటెత్తారు. దత్తనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పిఠాపురం పట్టణంలోని ఆలయాలకు గురువారం గురుపౌర్ణమి శోభ చేకూరింది. పాదగయ క్షేత్రంలో స్వయంభూగావెలసిన దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం చుట్టూ ప్రదిక్షణాలు చేసి ఔదంబర వృక్షంవద్ద పూజలు చేశారు. పాదగయ ఆవరణలోని అలక్‌నిరంజన్ దత్త బృందావనంలో లక్ష గులాబి అర్చన, లక్షతులసి అర్చన, విశేష పుష్పార్చనలు నిర్వహించారు. పల్లకిసేవ, ఊయల సేవ జరిగాయి. సాయినాధునికి విశేష అలంకారం చేశారు. దత్తగురువు వాడ్రేవు శ్రీనివాసరావు పూజలు జరిపించారు.

శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన పట్టణంలోని శ్రీపాదవల్లభ మహాసంస్థానంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సర్వపుష్పార్చన జరిగాయి. దత్తహోమం నిర్వహించారు. ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, గోవా, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలు కట్టి ప్రదిక్షణలు చేశారు. ఆలయ ఈవో సౌజన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బైపాస్‌రోడ్డులోని గోపాల్‌బాబా ఆశ్రమంలో సహా పలు సాయిబాబా ఆలయాల్లో అభిషేకాలు, పుష్పార్చన, పల్లకిసేవ నిర్వహించారు.

పిఠాపురాన్ని టెంపుల్ సిటీగా మారుస్తాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్
- పిఠాపురం ఆలయాల్లో పూజలు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో సౌజన్య

పిఠాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో దేవాలయాలను అపవిత్రం చేశారని, పలుఆలయాలపై దాడులు జరిగినా చర్యలు తీసుకోలేదని బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడుపీవీఎన్ మాధవ్ విమర్శించారు. పిఠాపురం పట్టణంలోని ఆలయాల్లో గురువారం పూజలు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పవిత్రమైన పిఠాపురంలో పాదగయక్షేత్రం, స్వయంభూగా వెలసిన కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తిపీఠం అధిష్టాన దేవతైన పురుహూతికాఅమ్మవారు, పంచమాధవుల్లో ఒకరైన కుంతీమాధవస్వామి, శ్రీపాదవల్లభ మహాసంస్థానం కొలువైఉన్నాయన్నారు. బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీపాదశ్రీవల్లభుడు జన్మస్థానమైన పిఠాపురం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పిఠాపురంవంటి ప్రాంతం ప్రపంచంలోనే ఎక్కడా ఉండదని చెప్పారు. పిఠాపురాన్ని టెంపుల్ సిటీగా మార్చేందుకు కృషిచేస్తున్నామని, దీనిపై ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో మాట్లాడామని తెలిపారు. పట్టణంలోని పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాల్లో మాధవ్ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఆర్.సౌజన్య మాధవ్ దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కందరాడలో జరిగిన కార్యక్రమంలో మొక్కలు నాటారు.

నా మాట వినకపోతే... పరీక్షల్లో ఫెయిల్ చేస్తా?

లైంగిక వేధింపులపై పారా మెడికల్ విద్యార్థినుల ఫిర్యాదు

జీజీహెచ్(కాకినాడ) జూలై 10 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్‌లో ఒకేషనల్, బీఎస్సీ ఎంఎల్‌టీ చదువుతున్న పారా మెడికల్ విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురయ్యారు. నెల రోజులుగా సాగుతున్న వేధింపులను తట్టుకోలేక 50 మంది విద్యార్థినులు కళాశాల యాజమాన్యానికి బుధవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఉన్నత వర్గాల ఆదేశాల మేరకు ఆర్ఎంసీ యాజమాన్యం 10 మంది సభ్యులతో కూడిన ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీకి ఫిర్యాదు పంపింది. దీంతో ఈ నెల 9, 10 తేదీల్లో విచారణను రహస్యంగా నిర్వహించింది.విచారణలో భాగంగా 50 మంది విద్యార్థినుల నుంచి లిఖిత పూర్వకఫిర్యాదు తీసుకున్నారు.అలాగే బాధ్యులుగా పేర్కొంటున్న బయోకెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి అతనికి సహకరించిన మైక్రోబయాలజీ టెక్నీషియన్ జిమ్మిరాజు,బయోకెమిస్ట్రీ ఎల్‌టి గోపాలకృష్ణ, పాథాలజీ ఎల్‌టి ప్రసాద్‌లను కమిటీ విచారించింది. విచారణ తుది నివేదికను కమిటీ గురువారం రాత్రి కళాశాల యాజమాన్యానికి అందించింది. ఈ విచారణలో కళ్యాణ్ చక్రవర్తి తమను తీవ్రంగా వేధించాడని విద్యార్థినులు ఫిర్యాదులో పేర్కొన్నారు. శరీరాన్ని అసభ్యకరంగా తాకడం, బుగ్గలను నిమరడం వంటి జుగుప్సాకరమైన చేష్టలు చేస్తూ తమకు నరకాన్ని చూపించాడని పేర్కొన్నారు. తాము విధుల్లో నిమగ్నమై ఉండగా అసభ్యకరమైన ఫొటోలు తీసి వన్‌టైమ్ వ్యూ ద్వారా తమ వాట్సాప్‌లకు పంపించేవాడని..రూమ్‌కు రమ్మని బెదిరించేవాడని, డబ్బులు ఎరవేసేవాడని, తన మాట వినకపోతే తాను రెగ్యులర్ ఉద్యోగినని తన పలుకుబడి వాడి పరీక్షలో ఫెయిల్ చేయిస్తానని బెదిరించాడని ఫిర్యాదులో విద్యార్థినులు పేర్కొన్నారు. అలాగే అతడికి జిమ్మిరాజు సహకరించి మద్యం సేవించి విధులకు హాజరై బూతులు తిట్టేవాడని కళ్యాణ్ చక్రవర్తి చెప్పినట్లు చేయాలని కోప్పడేవాడని వాపోయారు. డీఎంఈ ఆదేశాల మేరకు బాధ్యులను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయంపై తుది ఆదేశాలు శుక్రవారం వెలువడనున్నాయి.



ఏఎస్ఐపై తిరగబడుతున్న రౌడీ మూక

జీజీహెచ్‌లో రౌడీ మూక హల్‌చల్

జీజీహెచ్(కాకినాడ) జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జీజీహెచ్‌లో ఓ రౌడీ మూక గురువారం రాత్రి హల్‌చల్ చేసి అవుట్ పోస్ట్ పోలీసులపై తిరగబడింది. పెదపూడి మండలంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలు కొట్టుకున్నాయి. గాయాలపాలైన ఒక వర్గంలోని వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా మరో వర్గంలోని ఓ వ్యక్తి చిత్తుగా మద్యం సేవించి చికిత్స పొందుతున్న వ్యక్తిపైకి దూకుడుగా వెళుతున్న క్రమంలో అవుట్ పోస్ట్ ఏఎస్ఐ రవి వారిస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఆవ్యక్తి ఏఎస్ఐపై తిరగబడ్డాడు.పోలీస్, ఆసుపత్రి సిబ్బంది ఆ వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

కాకినాడ అర్బన్ ఏఎంసీ చైర్మన్‌గా బచ్చు శేఖర్

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

కాకినాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ వ్యవసాయ మార్కెట్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ అర్బన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వ్యవహరించనున్నారు.కమిటీ చైర్మన్‌గా బచ్చు నాగ వెంకట రాజశేఖర్ (బచ్చు శేఖర్), వైస్ చైర్మన్‌గా బడిగంటి దేవి నియమితులయ్యారు.కమిటీ సభ్యులుగా కొండేటి గంగాధరరావు,వడిశెల దాలమ్మ, కొపనాతి నాగకుమారి,ఎరిపిల్లి రాము, మహ్మద్ నిజా మున్నీసా,బుంగ నీలిమ, బొచ్చా దేవదాసు, సోలాపురి దేవరకొండ, దేవు జయలక్ష్మి, సుంకర రాఘువేంద్ర సురేష్‌బాబు, గొరుసు వెంకట దుర్గారావు,ముగుళ్ల బాబూరావు,మేడిశెట్టి ఈశ్వరరావులను నియమించారు. వీరితో పాటు పలువురు సభ్యులుగా వ్యవహరించనున్నారు



ఎక్కడపడితే అక్కడ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1500 వరకూ మెడికల్ షాపులు ఉన్నాయి. వాటిలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం నగరాల్లో 500 ఉండగా.. గ్రామాలు, మండల కేంద్రాల్లో వెయ్యి వరకూ ఉంటాయి. చాలా దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే అన్ని మందులనూ అమ్మేస్తుంటారు.నిద్ర మాత్రలు, యాంటి బయోటిక్స్ ఇలా అన్నీ దొరికేస్తుంటాయి. గ్రామాల్లో ఈ విధమైన వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. ఇదే అదనపుగా ఒక యువకుడు వయాగ్రా, అబార్షన్ కిట్లు, అబార్షన్ ట్యాబెట్ల వ్యాపారాన్ని తెరచాటుగా విస్తరించుకున్నాడు. గ్రామాల్లో అబార్షన్ కిట్లు విచ్చలవిడిగా దొరుకుతుండడంతో ఎలాంటి అనుమతులు, అనుభవం లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు.

మెడికల్ షాపులకు వెళ్లి ఏ మందు అడిగినా లేదనే సమాధానం రాదు..నిన్నటి వరకూ జ్వరం, దగ్గు, జలుబు మందులే అనుకుంటే.. ఇటీవల ఒక యువకుడు పట్టుబడడంతో అసలు విషయం బయటపడింది.. వయాగ్రా, అబార్షన్ మాత్రలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్టు తెలియడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నివ్వెరపోయింది.. డ్రగ్స్ శాఖ మామూళ్ల మత్తులో జోగుతుండడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి నిఘా పెట్టగా అన్ని మెడికల్ షాపుల్లోనూ ఈ తంతు నడుస్తున్నట్టు తెలుస్తోంది..

విచ్చలవిడిగా మందుల విక్రయాలు

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా ఓకే
- అందుబాటులో అబార్షన్ ట్యాబ్లెట్లు
- ఇబ్బడిముబ్బడిగా వయాగ్రా అమ్మకాలు
- దగ్గు మందులకు అడ్డేలేదు
- కొరవడిన డ్రగ్స్ శాఖ నిఘా
- మామూళ్ల మత్తే కారణం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రగ్స్ శాఖ మత్తు బిళ్లలు వేసుకోవడంతో మెడికల్ షాపుల వ్యాపారం జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. అధిక శాతం మెడికల్ షాపుల్లో అడిగిందే తడవుగా విచ్చలవిడిగా మందులను విక్రయిస్తున్నారు. ఎంతలా అంటే.. వైద్యుడి చీటీ లేకుండా షెడ్యూల్ 'హెచ్' మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదు. కానీ అవేమీ పెద్దగా పట్టింపు లేకుండా వ్యాపారాలు నడిచిపోతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖ (డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్) శాఖలోని పలువురు అధికారులు పలుకుబడి అనే మందు వాడుతుండడంతో గోదావరి జిల్లాల్లో వాడ వాడలా వయాగ్రా దొరుకుతున్నా చలనం లేదు.

చూసీచూడనట్టు..

ఉమ్మడి జిల్లా పరిధిలో రాజమండ్రి అర్బన్, రూరల్, కొవ్వూరు, తుని, కాకినాడ రూరల్, అర్బన్, అమలాపురంలలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరికి జిల్లా అధికారిగా ఏడీ ఉంటారు. వయాగ్రా అంశం గుప్పుమన్న తర్వాత పోడిపోడిగా తనిఖీలు చేశారు. కానీ ఏం జరిగిందో తెలియరాలేదు.దీనిపై ఉమ్మడి తూర్పు గోదావరి ఔషధ నియంత్రణ శాఖ ఏడీని వివరణ కోరడానికి రెండు రోజులపాటు ప్రయత్నించినా ఫోనులో అందుబాటులోకి రాలేదు. మెడికల్ షాపుల ద్వారా కొంత మొత్తం ముడు తుండడంతో కొందరు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మందుల విచ్చలవిడి విక్రయాలపై గత ఏడాది అక్టోబరులో 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా హెచ్చరించింది. మందుల విక్రయాలు ఇష్టానుసారం జరుగుతున్నాయని, వైద్యులు కూడా అనవసరమైన మందులను యథాలాపంగా రాసేస్తున్నారని పేర్కొంది.

అసలేంటి వయాగ్రా?

వయాగ్రా అనేది తయారీ కంపెనీ పేరు. ఆ మాత్రల్లో 'సిల్డినాఫిల్ సిట్రేట్' అనే మెడిసిన్ ఉంటుంది. అన్ని మందుల మాదిరిగానే దీనినీ మెడికల్ షాపుల్లో విక్రయించవచ్చు. కానీ వైద్యుల ప్రిస్క్రిప్షన్, పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలి. ఈ మెడిసిన్‌ని లైంగిక పటుత్వం, కలయిక సమయం పెరుగుదలకు వాడతారు. పల్మనరీ హైపర్ టెన్షన్‌కి ఒక్కోసారి వైద్యులు సూచిస్తారు. బీపీ ఉన్న వారు ఈ మెడిసిన్ వాడితే నరాలు పగిలిపోయి ప్రాణాపాయానికి దారి తీస్తుంది. ఈ ట్యాబ్లెట్లు 4.50 సంఖ్యా ప్యాక్‌లో దొరుకుతాయి. వీటిని ఆన్‌లైన్‌లో కూడా విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు.వీటికి ఉమ్మడి జిల్లాలో యువత అలవాటు పడడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది.రాజమండ్రిలో 2017-18లో వయాగ్రాకు సంబంధించి కేసులు పెట్టారు. అవి ఇప్పటికీ నడుస్తున్నాయి.కొన్ని నెలల కిందట దానవాయి పేటలోని ఓ పెద్ద మెడికల్ షాపులో కాలం చెల్లిన మందులు విక్రయించగా ఓ వారం రోజుల పాటు ఆ షాపును మూతవేయించారు. తర్వాత 'ఏ జరిగిందో' ఎవరికీ తెలియదు. ఏదే మైనా చాలామటుకు దుకాణం స్థాయిలోనే సర్దు బాటు అయిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ సీరియస్‌గా దృష్టి సారించాలనే వాదన వినవస్తోంది.

మందుల తీరు మాయ

గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటెటీవ్స్‌ని నియమించుకుని వ్యాపారం చేసేవి.అయితే ఇప్పుడు కొత్త ఒరవడి వచ్చింది. హరియాణాలోని బడ్డి అనే ఓ ప్రాంతంలో, అలాగే గుజరాత్‌లోని పలు చోట్ల మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. మెడికల్ రిప్రజెంటెటీవ్‌లుగా అనుభవం వచ్చిన తర్వాత కొందరు డాక్టర్ల వద్ద ఆర్డర్లు తీసుకొని సొంతంగా ఆ ప్రాంతాలకు వెళ్లి పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసి తీసుకు రావడం మొదలైంది.దీనిని ప్రొపగాండా కం డిస్ట్రిబ్యూషన్ (పీసీడీ) అంటారు. ఆ మందులపై సొంతగా పేరు వేయించుకోవచ్చు. సాధారణంగా మందులు తయారీ నుంచి వినియోగదారుడి చేతికొచ్చేసరికి 1500 శాతం ధర పెరుగుతుంది. ఇప్పుడు వయాగ్రా, అబార్షన్ కిట్లను తీసుకొచ్చి దందా సాగిస్తున్నారని తెలుస్తోంది.

నాడు కలెక్టర్ ఆదేశించినా..

ఉమ్మడి తూర్పులోని డ్రగ్స్ శాఖ పనితీరుకు దగ్గు మందుల అంశం మరో ఉదాహరణ. గంజాయి వంటివి కట్టడి చేసినా యువత మత్తులో జోగుతుండడంపై తూర్పు గోదావరి పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే నిఘా పెట్టగా..దగ్గు మందులను ఎక్కువ మోతాదులో తాగేస్తున్నారని తెలిసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా లభ్యమవుతుండడంపై నివ్వెరపోయారు. మెడికల్ షాపులపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.కానీ తర్వాత ఫలితం ఏమిటో డ్రగ్స్ అధికారులు బయటకు పొక్కనీయలేదు.

డొంక కదిలిందిలా..

గణేశ్ కుమార్ అనే యువకుడు రాజమహేంద్రవరంలోని ఓ పెద్ద కంపెనీ ఫార్మసీలో కొన్నాళ్లు పనిచేశాడు. ఇదిలా ఉండగా వేరే రాష్ట్రానికి చెందిన వారితో పరిచయం ఏర్పడింది. కొన్ని ఫార్మసీ కంపెనీలు షెడ్యూల్ హెచ్ డ్రగ్స్‌ని అక్రమంగా పెద్ద మొత్తంలో అమ్ముకోడానికి ఉద్యోగులను నియమించుకుంటాయి. ఈ మా దిరిగానే గణేశ్‌కి మార్గం దొరికింది. దీంతో అతడు వ్యాపారాన్ని విస్తరించుకున్నాడు. కొన్నేళ్లుగా వయాగ్రా ట్యాబ్లెట్లు, గర్భవిచ్ఛిత్తి మందులు, కిట్లు తెచ్చి మెడికల్ షాపులకు విక్రయిస్తున్నా డు. జంగారెడ్డిగూడెంలోని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ఎత్తున ఆ మందులు పట్టుబట్టాయి. అయితే ఉమ్మడి తూర్పుగోదావరిలో కూడా ఆ అక్రమ వ్యాపారం విక్రయించిందని చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకూ డ్రగ్స్ అధికారులు మేలుకోలేదు.


తాళ్లరేవులో తల్లుల పాదాలకు మొక్కుతున్న పిల్లలు


అమలాపురంలో తల్లుల దీవెనలు తీసుకుంటున్న పిల్లలు


రాజమహేంద్రవరంలో కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు


సర్పవరంలో తల్లుల పాదాలు కడుగుతున్న విద్యార్థులు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు


అమ్మా నీకే : పిఠాపురంలో తల్లులకు మొక్కలు అందజేత


ఆలమూరులో మెగా పీటీఎం ఆకారంలో విద్యార్థులు


నా అంత ఎదగాలి : గోపాలపురం రాజంపాలెంలో కలెక్టర్ ప్రశాంతితో నడచి వస్తున్న విద్యార్థి

మెగా పండుగ

పాఠశాలల్లో ఉత్సాహంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

విద్యాలయాలు పండుగ వాతావరణంతో కళకళలాడాయి. పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు ఆహ్లాదకర రీతిలో జరిగాయి. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని పాఠశాలల్లో వినూత్నంగా పీటీఎం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోను తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను మెగా ప్రగతిలో భాగస్వాములను చేశారు. కొన్ని చోట్ల విద్యార్థులు తమ తల్లులకు కాళ్లు కడిగి ప్రేమ చాటుకున్నారు. అమ్మ పేరున మొక్కనాటాలన్న ఆదేశాలతో పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి మొక్కలు అందజేశారు.


పి.గన్నవరంలో తల్లితో విద్యార్థినుల ఫొటో



రాజమహేంద్రవరం, కరపలో టగ్ ఆఫ్ వార్ నిర్వహిస్తున్న దృశ్యం


రాజమండ్రి సెల్ఫీ స్టాండ్ వద్ద డీఎల్ఎస్ సెక్రటరీ శ్రీలక్ష్మికి స్వాగతం

శాకంబరిగా రత్నగిరి దుర్గలు


శాకంబరిగా దర్శనమిస్తున్న వనదుర్గమ్మ


మరిడమ్మ అమ్మవారికి మహిళలు సమర్పించిన సారె

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనక దుర్గ, గ్రామదేవతలు నేరేళ్లమ్మ, మరిడమ్మ, వాసవీమాతలు శాకాంబరీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. ఈసందర్భంగా అమ్మవార్లను వివిద రకాలైన కూరగాయలతో అలంకరించారు. శాకాంబరీ అలంకారంలో ఉన్న అమ్మవార్లను భక్తులు, గ్రామస్థులు దర్శించుకున్నారు.

మరిడమ్మ అమ్మవారికి సారె సమర్పణ

గ్రామదేవతగా పూజలందుకుంటున్న మరిడమ్మ అమ్మవారికి గురువారం గ్రామంలో వెలంపేట మహిళలు సారెను సమర్పించారు. వివిధ రకాలైన పదార్థాలు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, కలశాలతో జలాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో అందజేశారు. అనంతరం వీటిని ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయకమిటీ సభ్యులు పెద్దింటి లక్ష్మణ్, యాళ్ల శ్రీనివాస్, వర్రే సత్యకుమార్ ఏర్పాట్లు చేశారు.

లోవలో ఆషాఢ మాసోత్సవాలు

తునిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన హోమ క్రతువుల్లో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలాచరించారు. పెద్దాపురం నాదస్వర విద్వాంసులు వారిచే నిర్వహించిన నాదస్వర సంగీత కచేరి భక్తులను అలరించింది. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు పండితులు వేద ఆశీర్వచనాలు గావించారు.

శాకంబరిగా ఆలమూరు రావులమ్మ

58 రకాలు.. 550 కిలోల కూరగాయలతో అలంకరణ



ఆలమూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఆలమూరు గ్రామదేవత రావులమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి అమ్మవారిని దర్శించుకున్నారు. రావులమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించడానికి భక్తులు సహకారంతో 58 రకాల కూరగాయలు 550 కిలోలతోపాటు వివిధ రకాల ఆకుకూరలతో అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. శాకాంబరి అమ్మవారిగా రావులమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు వేదుల లక్ష్మణశర్మ అధ్వర్యంలో పెద్దింటి కాశీవిశ్వనాధ శర్మశాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

నూకాంబిక ఆలయానికి రూ.5.5 లక్షల విరాళం

చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు మండపేటకు చెందిన టీడీపీ నాయకులు వంక సాయికుమార్‌బాబు భారీ విరాళం అందించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గుర్తించి రూ.5.5లక్షల విరాళంను ఆలయకమిటీకి అందించారు. దాత సాయికుమార్‌బాబును అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు అల్లంరాజు రామకృష్ణమూర్తి, గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, గన్ని సూరిబాబు, వైట్ల గంగరాజు, బొబ్బా ఏసు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గురుపౌర్ణమి.. వేడుకలు


బలభద్రపురంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా, దర్శనానికి బారులుదీరిన భక్తులు

బలభద్రపురంలో సాయిబాబాకు 1008 లీటర్ల ఆవుపాలతో అభిషేకం

బిక్కవోలు, జూలై 10(ఆంధ్రజజ్యోతి): బలభద్రపురంలోని సాయిమందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి బాబా దర్శనానికి భక్తులు బారులు తీరారు. కాకడ హారతితో వేడుకలు ప్రారంభించారు. అనంతరం సాయిబాబాకు 1008 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, శ్రీచక్రానికి లక్ష కుంకుమార్చన, దత్తాత్రేయ హోమం, చండీ మూలమంత్రం, సూర్యనమస్కారాలు, సహస్ర లింగార్చన, సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాబాకు క్షీరాభిషేకం జరిపి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. భక్తులకు బిరియాని ప్రసాదాన్ని అందించామని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు.మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బాబాను దర్శించుకుని పూజలు చేశారు.కార్యక్రమాల్లో కొవ్వూరి పాపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయదుర్గా పీఠంలో గాడ్ ఆశీస్సులు పొందుతున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి

సత్యదేవుడి సన్నిధిలో గురువందనం

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిదిలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా గురువందనం కార్యక్రమం టీటీడీ సహకారంతో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ అనంతతీర్థాచార్యులు ఆయన శిష్యబృందం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువుల వద్ద నేర్చుకున్న విద్యను సమాజానికి ఉపయోగపడేలా వ్యవహరించినప్పుడే జ్ఞాన సముపార్జనకు సార్థకత చేకూరుతుందన్నారు.ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో నడవాలని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో గురుపూజోత్సవం

రాయవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాకలోని విజయదుర్గా పీఠంలో బీజేపీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వేర్వేరుగా పీఠాన్ని దర్శించుకున్నారు. గాడ్‌కు ఎమ్మెల్యే పుష్పాలతో పాదపూజ చేయగా ఎంపీ సత్కరించారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యే విజయదుర్గమ్మను దర్శించుకున్నారు. అర్చనలు, హారతులు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పీఠాన్ని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యేను పీఠం ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు సత్కరించారు. కార్యక్రమల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కర్రి చిట్టిబాబు, కోన సత్యనారాయణ, చాత్రాతి జానకి, ఎం.శ్రీదేవి, శాకా దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి 3 కిలోల వెండి ఆభరణాలు

ద్రాక్షారామ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి రామచంద్రపురం మండలం హసన్‌బాద మాజీ సర్పంచ్ పచ్చిపాల వీరవెంకట్రావు, వెంకటలక్ష్మీ దంపతులు రూ 3.70 లక్షలు విలువైన 3 కేజీల వెండి ఆభరణాలు బహూకరించారు. వెండి కవచం, కిరీటం తదితర ఆభరణాలు ఆలయ అర్చకులకు అందచేశారు.

మధ్యవర్తిత్వంతో శాంతియుత పరిష్కారం

పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంలో శాంతియుత పరిష్కారానికి అవకాశం ఉంటుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం దిశగా 86 మంది న్యాయవాదులకు 40గంటలపాటు తమిళనాడు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమ ప్రారంభించిన ఆమె.. 'దేశం కోసం మధ్యవర్తిత్వం' వారోత్సవాల పోస్టర్‌ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయ సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా ప్రజలు తమ వివాదాలను శాంతియుతంగా, తక్కువ ఖర్చుతో, త్వరగా పరిష్కరించుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ సమస్యలకు మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వక పరిష్కారం



సాధ్యమవుతుందన్నారు. ఇరు పక్షాల నుంచి సామరస్య అంగీకారం తీసుకొని ఆ మేరకు అవార్డు(తీర్పు) జారీ చేయనున్నట్టు చెప్పారు. రాజీ అంటే ఇరు పక్షాలదీ గెలుపేనని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పీఎల్వీలు తదితరులు పాల్గొన్నారు.

సేవ్ మల్లయ్యపేట


మల్లయ్యపేట పేపరుమిల్లు రోడ్డులో కమ్మేసిన దుమ్ము ధూళి

దుమ్ము, ధూళి నుంచి రక్షించండి

ఫ్లెక్సీలతో గ్రామస్థుల వినూత్న నిరసన

రాజమహేంద్రవరం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కాలుష్యం నుంచి మల్లయ్యపేటను రక్షించాలని కోరుతూ గ్రామస్తులు వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. కాతేరు గ్రామ పరిధిలోని మల్లయ్యపేటలో పేపరుమిల్లు నార్త్‌గేట్ వైపు నుంచి వస్తున్న ఇసుక లారీలు, మిల్లుకు వచ్చేలారీలతో రోడ్డు మొత్తం దుమ్ముధూళితో నిండిపోయింది. దీంతో వర్షపడినప్పుడు బురదమయమై ద్విచక్ర వాహనాలు జారి పడి ప్రజలు గాయాపాలవుతున్నారు. ఎండ కాసినప్పుడు దుమ్ము మొత్తం గాలిలోకి లేచి రోడ్డు పక్కన ఇళ్లున్న వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఆహార పదార్థాలపై కూడా దుమ్ముపడి తినడానికి పనికి రాకుండా పోతుందని, అలాగే రోడ్డుపక్కన చిరు వ్యాపారులు తయారు చేసే ఆహార పదార్థాలపై పడి వాటిని విక్రయించే పరిస్థితి లేక పోతుందని వాపోతున్నారు. షాపుల నిండా దుమ్ము చేరడంతో పరిస్థితి దారుణంగా మారిపోయింది. దీనిపై పంచాయతీ అధికారులకు, పేపరు మిల్లు యాజమాన్యానికి చెప్పి చెప్పి విసుగు చెందిన గ్రామస్థులు వారి ఇళ్లు, షాపుల ముందు 'సేవ్ మల్లయ్యపేట' అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. గురువారం సాయంత్రం మల్లయ్యపేటలో రోడ్డుపై నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పేపరుమిల్లు నార్త్ గేట్ రోడ్డు చాలా దారుణంగా మారిపోయిందని, ఆ రోడ్డులో వచ్చే ఇసుక లారీలతో మట్టి వస్తుందని దీనికి ఇసుక తోడై మల్లయ్యపేట రోడ్డు పైకి చేరి మెయిన్ రోడ్డు కాస్తా మట్టి రోడ్డులా మారిపోయిందన్నారు. విజయవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, స్థానికంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థల బస్సులు, పేపరు మిల్లుకు వచ్చే కర్రల లోడు లారీలు, ఇసుక లారీలతో రోడ్డు దారుణంగా మారిపోయిందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ దుమ్ము ధూళి నుంచి బయటక పడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధూళి వల్ల కళ్లమంటలు, ఊపిరి పీల్చడంతో లోపల మట్టి పట్టి ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.


ముఖానికి మాస్క్ ధరించి ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు


షాపుల వద్ద 'సేవ మల్లయ్యపేట' ఫ్లెక్సీలు పెట్టిన వ్యాపారస్తులు

రామాలయం పునః నిర్మాణానికి ఒప్పందం

బీజేపీ ధార్మిక సెల్ తెలంగాణ స్టేట్ కన్వీనర్, సినీ నటి కరాటే కళ్యాణి


షాపు యజమానితో మాట్లాడుతున్న కళ్యాణి

సీతానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని స్వీట్ స్టాల్ నిర్వాహకులతో రామాలయ పునః నిర్మాణానికి ఒప్పందం జరిగిందని శ్రీ ఆదిబట్ల కళా పీఠ వ్యవస్థాపక అధ్యక్షురాలు, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ మహిళా అధ్యక్షురా లు, బీజేపీ ధార్మిక సెల్ తెలంగాణ స్టేట్ కన్వీనర్, సినీ నటి కరాటే కళ్యాణి తెలిపారు. గురువారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని రామాలయాన్ని స్వీట్ స్టాల్‌ను కళా పీఠం జిల్లా అధ్యక్షురాలు పోతుల సుబ్బలక్ష్మి సందర్శించారు. రామాలయం మండపం కూల్చి స్వీట్‌స్టాల్ పెట్టారని, షాపు యజమాని క్రిస్టియన్ అని ఫిర్యాదులు రావడంతో కరాటే కళ్యాణి పరిశీలించడానికి వచ్చారు. రామాలయం నిర్వాహకులను పిలిచి ఆరా తీశారు. పూర్వకాలం నుంచి ఆలయ నిర్వహణ తామే చూస్తున్నామని, మూడేళ్ల క్రితం మండపం కూలిపోయే దశకు చేరుకోవడంతో దానిని కూల్చివేశామని తెలిపారు. గుడి ఎక్కడ కట్టినా ఆర్థిక సహాయం చేస్తామని చెప్పడంతో ఖాళీగా ఉన్న మండపం స్థానంలో స్వీట్‌స్టాల్ కట్టుకోవడానికి సరే ఒప్పుకున్నామన్నారు. కళ్యాణి సమక్షంలో రెడ్డి కుటుంబానికి హిందూ ధర్మం స్వీకరింపజేశారు. (ఘర్‌వాపసి) ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆలయం కట్టే సమయంలో రాతి విగ్రహాలు ఏర్పాటుచేసి, ఆలయ నిర్మాణానికి షాపు యజమాని ఒప్పుకోవడంతో స్వీట్‌స్టాల్ ఉంచడానికి అనుమతి ఇచ్చామన్నా రు. ఆరు నెలల్లో ఆలయ నిర్మాణం జరగాలన్నా రు. కాగా జనసేన వీరమహిళ సూర్యావతి మాట్లాడుతూ ఆలయ నిర్వాహకులకు గుడిలో జరిగే కార్యక్రమాలపైనే అజమాయిషీ గాని గుడిని అమ్ముకోవడానికి గాని గుడిని కూలగొట్టడానికి గాని అధికారం లేదన్నారు. దీనిపై పోరాటం చేసి ఆలయాన్ని పరిరక్షిస్తామని ఆమె అన్నారు.


పురస్కారం అందుకుంటున్న సుగుణారెడ్డి

ఆదిత్య డైరెక్టర్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం

కాకినాడ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్, రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా వైస్‌చైర్మన్ డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా రెడ్‌క్రాస్ పురస్కారాన్ని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. 2022, 23, 24 సంవత్సరాలకు గానూ ప్రథమస్థానం పురస్కారాన్ని గవర్నర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ రెడ్‌క్రాస్‌ను ప్రథమ స్థానంలో నిలిపినందుకు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. సుగుణారెడ్డిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

రహదారిని ముంచేసిన వరద!

- కోనసీమను తాకిన గోదావరి నీరు
- గంటిపెదపూడి బూరుగులంకలో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- నాలుగు లంక గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఇంజన్ పడవలపై ప్రయాణాలు


గంటిపెదపూడి శివారు బూరుగులంక వద్ద పడవలో వెళ్తున్న లంక గ్రామస్తులు


గంటిపెదపూడిలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారి

పి.గన్నవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎగువన వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాలకు గోదావరికి వరద నీరు ప్రవాహం నెమ్మదిగా పెరుగుతుంది. ఈ క్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడి, ఉడిమూడికి చెందిన నాలుగు లంకగ్రామాల ప్రజానీకం రాకపోకలు సాగించేందుకు బూరుగు లంక నదీపాయలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి గురువారం తెల్లవారుజామున వరద నీటిలో కొట్టుకుపోయింది. వరదనీరు గట్టును తాకిన అరగంటలోనే గట్టు వరద ప్రవాహంలో పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గంటిపెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడి శివారు ఊడిమూడిలంక గ్రామాల ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఇంజన్ పడవలపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు దగ్గర నుంచి వ్యవసాయ ఉత్పత్తులు తరలించే రైతులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి లంక గ్రామాల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక గ్రామస్తులు వైవిపాలెం, బెల్లంపూడి వద్ద నదీపాయల్లోకి వరద నీరు రావడంతో ఆ గ్రామాల ప్రజలు నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.


అయినవిల్లి: ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో రహదారికి గండి పడడంతో ఆగిపోయిన ప్రయాణికులు

రహదారికి గండి

అయినవిల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరద తాకిడితో కోనసీమ జిల్లా ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో తాత్కాలిక రహదారి గండి పడింది. కార్లు, ఆటోల ప్రయాణాలు నిలిచిపోయాయి.

లైఫ్‌జాకెట్లు ధరించడం తప్పనిసరి : ఆర్డీవో

లంకగ్రామస్తులు నదీపాయ దాటే సమయంలో తప్పనిసరిగా లైఫ్‌జాకెట్లు ధరించాలని ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. లైఫ్‌జాకెట్లు ధరించనివారిని దాటించవద్దని హెచ్చరించారు. పడవపై పదిమందిని మాత్రమే దాటించాలన్నారు. ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. ప్రస్తుతం 2 ఇంజన్ పడవలు తిరుగుతున్నాయని, వాటిలో లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేశామన్నారు. లంక గ్రామాల నుంచి సుమారు 40 మంది విద్యార్థుల వరకు బయట పాఠశాలల్లో చదువుకుంటున్నారని రోజూ పడవలు దాటే వారికి ప్రత్యేక లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేశామన్నారు. నదీపాయకు ఇరువైపులా రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ టి.సాయినాథ్ జయచంద్ర గాంధీ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి నాలుగు లంక గ్రామాల్లో పర్యటించారు.

'ముంపు' టెన్షన్

- భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతోన్న గోదావరి
- లోతట్టు ప్రాంతాల ప్రజల్లో ఆందోళన ప్రారంభం
- వలస పాకల ఏర్పాట్లలో నిమగ్నం


వరరామచంద్రపురంలో లోతట్టు ప్రాంత వాసులు ఏర్పాటు చేసుకుంటున్న వలస పాకలు

చింతూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరదల కాలం వచ్చింది. దీంతో ముంపు ప్రాంతాల్లో టెన్షన్ ప్రారంభమైంది. నదీ పరివాహక ప్రాంతంలో ఎడతెరిపి లేని వర్షం కురవగా అక్కడి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవడం సహజం. ఐతే విలీన మండలాల పరిస్థితి అందుకు భిన్నం. మన రాష్ట్రంతో పాటు ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినా, వరదలు సంభవించినా ఆ ప్రభావం ఇక్కడ పడుతుంది. ఇది ప్రతి ఏటా జరిగే తంతే. వీటికి తోడు ఇప్పుడు పోలవరం బ్యాక్ వాటర్ తోడైంది. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు లోతట్టు వాసులకు కంటిమీద కునుకు కరువే. శబరి, సీలేరు, గోదావరి నదుల ఉధృతే దీనంతటకీ కారణం. ప్రతి ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఇది తప్పని దుస్థితి. కొన్నేళ్లుగా జూలై లోనే గోదావరి ఉగ్రరూపం దాల్చిన సందర్భాలున్నాయి. దీంతో ఈనెల ఎట్లా ఉంటుందోనన్న ఆందోళన అలముకుంది. ఇప్పటికే భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం 3 గంటలకు భద్రాచలంలో 24.10 అడుగులకు గోదావరి చేరుకుంది. గతేడాది జూలై 27న భద్రాచలం వద్ద గోదావరి 53.6 అడుగుల గరిష్ఠ ప్రవాహం నమోదైంది. దీంతో లోతట్టు గ్రామాలు నీట మునగడమే కాకుండా రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం..

గడచిన ఆరున్నర దశాబ్దాల కాలంలో జూలై నెలలో గోదావరి వరద ఉధృతిని పరిగణలోకి తీసుకుంటే 14 సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. అదే దశలో ఆరు పర్యాయాలు తుది ప్రమాద హెచ్చరిక (53 అడుగులు) దాటి ప్రవహించింది. వరుసగా 1972 జూలై 6న 44.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 24న 56.7, 2003 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 47, 2016 జూలై 12న 52.4, 2022 జూలై 16న 71.3 అడుగులు, 2023 జూలై 30న 56.1, 2024 జూలై 27న 53.6 అడుగులకు చేరుకుని ప్రవహించింది. వీటిలో 2022 జూలై 16న రికార్డుస్థాయిలో 71.3 అడుగుల మేర గోదావరి ప్రవాహం నమోదైంది. దీంతో చింతూరు డివిజనులోని లోతట్టు గ్రామాలు ఛిద్రమయ్యాయి. ఇళ్లు కూలిపోయి బురదలో కూరుకుపోయాయి. ఇక రహదారులు సరేసరి. భద్రాచలంలో గోదావరి నది 59 అడుగుల నుంచి 63 అడుగుల వరకు ప్రవహించిన క్రమంలో చింతూరు డివిజనులోని 180 గ్రామాలపై ఆ ప్రభావం పడనుంది. అపై ప్రవాహం ఉంటే మునక మరింత పెరుగుతూ ఉంటుంది.

సమీక్షలు...

ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఒక పర్యాయం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ మండలాల వారీగా వరద సమీక్షలు నిర్వహించారు. ఆ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలు, అధికారులకు స్పష్టం చేశారు. భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతుండడం, రానున్న రెండు రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికలతో లోతట్టు వాసులు సురక్షిత ప్రాంతాలలో వలస పాకల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అదే దశలో సామగ్రిని కూడా సురక్షిత ప్రదేశాలలో భద్రపర్చుకుంటున్నారు.

సత్యనారాయణకు హ్యాండ్‌లూమ్స్ వేడుకల్లో పాల్గొనే అవకాశం


సత్యనారాయణ

ముమ్మిడివరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఆగస్టు 7న జరిగే నేషనల్ హ్యాండ్‌లూమ్స్ డే సెలబ్రేషన్స్ వేడుకల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గేదెలలంక చెందిన చేనేత కార్మికుడు పచ్చిపులం వీరవెంకటసత్యనారాయణకు అవకాశం దక్కింది. ఈ మేరకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ నుంచి సత్యనారాయణకు వర్తమానం అందింది. ప్రధాని మోదీ పాల్గొనే హ్యాండ్‌లూమ్ సెలబ్రేషన్స్‌లో పాల్గొనే అవకాశం సత్యనారాయణకు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గతేడాది ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొనే అవకాశం సత్యనారాయణకు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యూఢిల్లీ, ముంబై, కలకత్తా రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన చేనేత ఎగ్జిబిషన్‌లో సత్యనారాయణ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తుంటాడు. సత్యనారాయణ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అనేకమంది పేద చేనేత కార్మికులకు పలు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నాడు. ఎన్‌హెచ్‌డీపీ ద్వారా పేదలకు వర్క్‌షెడ్ల నిర్మాణం, ముద్ర రుణాలు, చేనేత మగ్గాలు వంటివి సమకూర్చాడు. 27మందికి ఒక్కొక్కరికీ రూ.లక్షా 20వేలు వంతున ఉచితంగా షెడ్ల నిర్మాణం, 30మందికి 25శాతం రాయితీపై ముద్ర లోన్లు, 30శాతం రాయితీపై 35మందికి మగ్గాల కొనుగోలుకు ఒక్కొక్కరికీ రూ.30వేలు వంతున అందించాడు. సత్యనారాయణ చేస్తున్న సేవా కార్యక్రమాలు, చేనేత ఉత్పత్తుల ప్రదర్శనలు ఏర్పాట్లు చేయడంలో ఉత్సాహం ప్రదర్శించడంతో ఈ అవకాశం దక్కింది.

ఇద్దరు బాలికల మిస్సింగ్‌పై కేసు


నల్లా లతాశ్రీ


నల్లా సత్యవతి

రావులపాలెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలు ఇంట్లో చెప్పకుండా కనిపించకుండా వెళ్లిపోయిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన నల్లా లతాశ్రీ (17), నల్లా సత్యవతి (14) ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు వారి ఆచూకీ కోసం గాలించిన లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్స్ రాగిదిమ్మల చోరీలు...
దొరికిన అంతర్ జిల్లా దొంగలు

- ముఠా సభ్యులను దేవరపల్లిలో పట్టుకున్న పోలీసులు
- రూ.10 లక్షల విలువైన 67 రాగిదిమ్మలు, 2 కార్లు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్


పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగిదిమ్మలు

దేవరపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగిదిమ్మలు దొంగిలించిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని రాగి వైర్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ, కొవ్వూరు ఎస్‌డీపీవో, రాజమహేంద్రవరం సీసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఆ టీమ్‌లు సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల సహకారంతో నలుగురు అంతర్ జిల్లాల దొంగలను దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద గురువారం అరెస్టు చేసినట్టు తెలిపారు. వారితో పాటు రాగివైరు కొనుగోలు చేసిన ఇద్దరు వ్యాపారులను కూడా అరెస్టు చేసినట్టు చెప్పారు. వారు తూర్పుగోదావరి, ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, కోనసీమ జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగిలించారని, వాటి విలువ రూ.10లక్షలు ఉంటుందని తెలిపారు. చోరీలకు పాల్పడిన పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం రాయికుదురు గ్రామానికి చెందిన కడలి సతీష్, ఏలూరు జిల్లా కృతివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేండ్రపు దుర్గాశ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన బళ్లా విజయరత్నం, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాల దిబ్బ గ్రామానికి చెందిన ఏలూరు పోసియ్యలతో పాటు పాటు చోరీ సొత్తు కొన్న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గొల్లవాని దిబ్బ గ్రామానికి చెందిన పావురాయిల కోటేశ్వరరావు, భీమవరం మండలం దిర్శిమర్రు గ్రామానికి చెందిన సవరపు భీమారావును అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారి నుంచి రూ.10 లక్షల విలువైన 67రాగిదిమ్మలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. వీటితో పాటు 2 కార్లు, 2 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు గతంలో వివిధ పోలీస్‌స్టేషన్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నేరాలపై అరెస్ట్ అయ్యి బెయిల్‌పై ఉన్నారని తెలిపారు. కేసును చేధించిన దేవరపల్లి సీఐ బీఎస్‌నాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, రాజమండ్రి సీసీఎస్ సీఐ శ్రీధర్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో దేవరపల్లి విద్యుత్ ఏఈ సీ.వెంకట్రావు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రాజోలు ఆర్ఐ


పట్టుబడిన ఆర్ఐ రాంబాబు

రాజోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ రాజోలు ఆర్ఐ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన గుబ్బల కృష్ణతులసి భర్త అగ్నిమాపక అధికారిగా పనిచేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 27 మరణించారు. కృష్ణతులసి ఈనెల4న తన పేరున ఎలాంటి ఆస్తులు లేనట్టు నో ప్రాపర్టీ సర్టిఫికెట్, ఎలాంటి సంపద లేనట్టు నో ఎర్నింగ్ నంబరు సర్టిఫికెట్ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సిందిగా కోరుతూ రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంది. దరఖాస్తుపై విచారణ రిపోర్టును తహశీల్దార్‌కు పంపడానికి రాజోలు ఆర్ఐ కె.రాంబాబు రూ.20వేలు డిమాండ్ చేశాడు. కృష్ణతులసికి ఆ లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులకు ఆర్ఐపై ఫిర్యాదు చేసింది. తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రాజోలు ఆర్ఐ రాంబాబు లంచం రూ.20వేలను తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఆర్ఐను శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు. దాడిలో ఇన్‌స్పెక్టర్లు ఎన్వీ భాస్కరరావు, వై.సతీష్‌కుమార్, డి.వాసుకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడలో 320 గ్రాముల బంగారం చోరీ


పగులగొట్టి ఉన్న బీరువా లాకర్

కాకినాడ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో సుమారు 320 గ్రాముల బంగారం చోరీ అయినట్టు టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. కాకినాడ ప్రతాప్‌నగర్ ట్రెజరీ కాలనీకి చెందిన భూపతి శ్రీదేవి గత కొన్ని రోజులుగా ఇంటికి తాళం వేసి నాగపూర్ వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తలుపులు బద్దలు గొట్టి తెరిచి ఉండడాన్ని పై పోర్షన్‌లో ఉంటున్న ఆమె బంధువులు గమనించి శ్రీదేవికి సమాచారం అందించారు. దాంతో ఆమె తన బంధువులతో లోపలకి వెళ్లి పరిశీలించమని కోరింది. ఈ క్రమంలో సుమారు 320 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అవ్వడంతో పాటు రూ.15 వేలు నగదు, మరికొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్టు బంధువుల ద్వారా ఆమె తెలుసుకుంది. ఆమె బంధువులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ ప్రారంభించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించాయి.

ఆదియోగి విగ్రహం పాక్షికంగా ధ్వంసం

- సామర్లకోటలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు


విగ్రహం ముక్కు భాగాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

సామర్లకోట, జూలై10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి పుష్కరిణి సమీపాన భీమేశ్వరాలయం రోడ్డు వద్ద విశేష పూజలందుకుంటున్న ఆదియోగి శిలా విగ్రహం ముక్కు భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం ఆ దారిన వెళ్లే భక్తులు చూసి స్థానికులకు సమాచారం అందించారు. భీమేశ్వరాలయ కమిటీ మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ ఆదియోగి విగ్రహాన్ని పరిశీలించారు. ఇటీవలే కార్తీకమాసంలో విగ్రహాన్ని కాశీ పుణ్యక్షేత్రం నుంచి తీసుకువచ్చి ఎమ్మెల్యే చినరాజప్ప చేతులమీదుగా ప్రతిష్ఠించిన విషయం విధితమే. ఎమ్మెల్యే చిన రాజప్పకు సమాచారం అందివ్వగా పోలీసు లకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా విగ్రహ ధ్వంసం చర్యలకు పాల్పడినవారిని గుర్తించి అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.


రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

పెరుగుతోన్న గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి గోదావరి నీటి మట్టం 10.30 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ 175గేట్లను మరింత పైకి ఎత్తి 0.60 మీటర్ల వద్ద ఉంచి 2,65,105 క్యూసెక్కులను దిగువకు వదిలివేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో అన్ని చోట్ల నీటి మట్టం పెరుగుతుంది. శుక్రవారం సాయంత్రానికి సుమారు 5 లక్షల క్యూసెక్కుల ప్రభావం, శనివారం నాటికి 9 లక్షల క్యూసెక్కులు వరద ప్రవాహం ధవళేశ్వరానికి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటి మట్టం 24.50 అడుగులకు చేరుకుంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి మూడు డెల్టాలకు 13750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పోలవరం ప్రాజెక్ట్ ఉద్యోగి మృతి

సీతానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో అద్దె ఇంటిలో ఉంటూ పోలవరం ప్రాజెక్ట్‌లో ఉద్యోగం చేస్తున్న అంకిత్ కటియార్(34) విద్యుదాఘాతంతో మృతి చెందినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో ఫీల్డ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్ ఉదయం 8గంటలకు ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న తన భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. 9 గంటల నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయక పోవడంతో ప్రాజెక్ట్‌లో ఉద్యోగం చేస్తున్న హెచ్‌ఆర్‌కు ఫోన్ చేసి తెలియపరచగా సహ ఉద్యోగి విశాఖ పట్నానికి చెందిన తాతనపాత్రుని గిరిబాబు వచ్చి చూడగా చేతిలో చిన్నఫ్యాన్‌తో కటియార్ నిర్జీవంగా ఉన్నాడు. దీంతో అతడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్టు గుర్తించారు. మృత దేహాన్ని రాజమహేం ద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గిరిబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కరప, జూలై 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందినట్టు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ సూరిబాబు తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం మట్లపాలెనికి చెందిన వనమాడి మహేష్(24) కాకినాడ పోర్టులో పనిచేస్తున్నాడు. ఈనెల 8న ఇంటి నుంచి డ్యూటీకి బైక్‌పై బయలుదేరి కరప మండలం ఉప్పలంక వంతెన దిగుతూ అదుపుతప్పి కిందపడడంతో గాయపడ్డాడు. కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు.

మా కుటుంబంపై అసత్యప్రచారాన్ని ఆపండి

- లేకపోతే ఎదురుదాడికి దిగుతాం : జక్కంపూడి గణేష్

కాకినాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబంపై జనసేన నేతలు సోషల్‌మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని లేకపోతే ఎదురుదాడికి దిగుతామని వైసీపీ యువజన విభాగం ప్రాంతీయ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేశ్ అన్నారు. తన తండ్రి దివంగత రామ్మోహనరావు, అన్న రాజా, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారు ముందు వారి పార్టీ గురించి, నాయుల పరిస్థితి తెలుసుకోవాలని హితవు పలికారు. గురువారం కాకినాడలోని ఆయన బంధువుల ఇంట్లో మీడియాతో మాట్లాడారు. తమ కుటుంబంపై జనసేన నేతలు బెట్టింగ్ మాఫియా, భూ కబ్జాలు, పేకాట క్లబ్బులు నిర్వహిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిలో ఆధారాలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీలు మారతామంటూ దుష్ప్రచారం చేస్తున్న కూటమి నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. తాము ఎప్పటికీ వైసీపీలోనే ఉంటామన్నారు. తమ కుటుంబాన్ని విమర్శించిన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీలు వారి పనితీరులో దిగజారిపోయారన్నారు. కూటమి ఎప్పుడు బద్దలవుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఆ పార్టీ నేతలున్నారన్నారు.







గోదారి ఉరకలు.. అందాల వెలుగులు

ఒకవైపు గోదావరి ఉరకలు వెస్తుంటే మెల్లగా వచ్చాడు సూరీడు. తన వెలుగును కాస్త గోదావరిపై ప్రసరింపచేసి మరింత అందంగా మార్చివేశాడు. అల్లూరి జిల్లా కూనవరం మండలం శబరి, గోదావరి సంగమం వద్ద గురువారం సాయంత్రం వేళ కనిపించిన ఈ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా వడిసిపట్టింది. - కూనవరం (ఆంధ్రజ్యోతి)

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

విద్యకు అధిక ప్రాధాన్యం

● ఘనంగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు ● పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

సామర్లకోట, జూలై 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా అందరూ విద్యనేర్వాలని, అందుకు కూటమి ప్రభుత్వం అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు గురువారం సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట కూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. స్కాట్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. పాఠశాలలో మొదటిసారిగా ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సులను ప్రారంభంలో భాగంగా నూతనంగా మంజూరైన కంప్యూటర్లను ఎమ్మెల్యే చినరాజప్ప స్విచ్ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, కంటే జగదీష్‌మోహన్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, తాతపూడి పవన్‌కుమార్, ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య తదితర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామిపాల్గొని నూతనంగా ప్రవేశపెట్టిన వృత్తివిద్య ఆటోమేటివ్ విభాగాన్ని ప్రారంభించారు. అలాగే యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగాపేరెంట్స్ టీచర్స్ సమావేశం పురస్కరించుకుని నిర్వహించిన వివిధపోటీలలో విజేతలకు బహుమతులను మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య అందజేశారు.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● ఎమ్మెల్యేదాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు: కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కూటమిప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. గురువారం తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్, సీతారామపురం ఆదర్శపాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీతారామపురం ఆదర్శపాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, స్కూల్‌కమిటీ చైర్మన్ శివన్నారాయణ, ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టీడీపీ నేతలు కట్టా త్రిమూర్తులు, జక్కల ప్రసాద్‌బాబు, జనసేననేత అత్తిలి బాబూరావు, బీజేపీ కన్వీనర్ విత్తనాల కరిమిళస్వామి, వుంగరాల వెంకటేశ్వరరావు, ఎంఈవోలు మంగాయమ్మ, ఉమ, ఎంపీడీవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసిన చోటే విద్యారంగ వికాసం..

● సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసినచోటే విద్యారంగ వికాసం చెందుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక జగన్నాధపురం ఏఎస్ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, ఎంఎస్ఎన్ ఎయిడెడ్ స్కూల్, ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాల, ఆనంద భారతి, చర్చి స్క్వేర్‌సెంటర్, గొడారిగుంట మున్సిపల్ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన చదువుల పండుగ మెగా పేరెంట్-టీచర్ ఆత్మీయ సదస్సుల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ నాణ్యతతో కూడిన విద్యను అందిస్తోందన్నారు.

ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో నడుచుకోవాలి

● డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం: ప్రతీవిద్యార్థి మంచి క్రమశిక్షణతో నడుచుకోవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. పట్టణ పరిధిలోని పద్మనాభా కాలనీలో ఉన్న బాలికల పాఠశాల, మండల పరిధిలోని చంద్రమాంపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహి ంచిన మెగా పేరెంట్స్, టీచర్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గురువారం మాట్లాడారు. విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి వారికి బహుమతులను అందజేశారు. వారితో కలిసి భోజనాలు చేశారు. పలువురు కూటమి నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగు తుందని జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ విద్యార్థులకు బహూకరించిన 300 స్టీల్ కంచాలను ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఉన్నతపాఠశాల ఆవరణలో ఆయన మొక్కలను నాటారు. జీజీహెచ్ డైరెక్టర్‌రావు అక్షయ్, పీబీసీ డీసీ1 చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఉపసర్పంచ్ మామిడి మల్లిబాబు, పేరెంట్స్‌కమిటీ చైర్మన్ చందనాల సత్యనారాయణ, జనసేన నాయకులు, మత్సా అప్పాజీ, బొజ్జా లోవరాజు, మేడిది రమేష్, తెలగంశెట్టి వెంక టేశ్వరరావు, కొత్తపల్లి నీటిసంఘం అధ్యక్షుడు తలారి వెంకట త్రిమూర్తులు, మండల విద్యాశాఖాధికారులు బుర్రావేణుగోపాల్ పాల్గొన్నారు.

సర్పవరంజంక్షన్: కాకినాడరూరల్ మండల పరిధిలోగల పండూరు, తిమ్మాపురం, సూర్యారావుపేట, సర్పవరం, రమణ య్యపేట, గైగోలుపాడు, కొవ్వాడ, రేపూరు, ఇంద్రపాలెం, కొవ్వూరు, తూరంగి, పగడాలపేట తదితర గ్రామాల్లో గురువారం ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలలు, హైస్కూల్స్, జూనియర్ కాలేజీల్లో ఘనంగా మెగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహించిన పీటీఎం ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రోగ్రామ్ కాకినాడరూరల్ నియోజకవర్గ పరిశీలకులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, అసిస్టెంట్ కలెక్టర్ మనీషాలు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు.

కరప: కరప మండలంలోని 64 ప్రభుత్వ, 17 ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ వేడుకగా జరిగింది. ఉప్పలంక హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పాల్గొని పేరెంట్స్‌కు తల్లికి వందనం నమూనా చెక్కును అందజేశారు. కరప హైస్కూల్‌లో హెచ్ ఎం ఎన్.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. పెద్దాపురప్పాడు హైస్కూల్‌లో హెచ్‌ఎం వై.చంద్రశేఖర్, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు తెలగాని వెంకట్రావు, గురజనాపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎ.సాయి మోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, అరట్లకట్ట హైస్కూల్‌లో పి.శ్రీనివాసకుమార్, నడకుదురు మోడల్ ప్రైమరీ పాఠశాలలో హెచ్ ఎంబీఎం రత్నకుమారి, వాకాడ వెంకటరమణల ఆధ్వర్యంలో ఈ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవు : సీతారామపురంలో విద్యార్థులతో చేయికలుపుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఫొటోబూత్ అట్రాక్షన్ పాయింట్

పిఠాపురం: మెగా పీటీఎం 2.0సందర్భంగా పిఠాపురం పట్టణంలోని మునిసిపల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసి ఫొటోబూత్‌లు సెంట్రల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈబూత్‌ల వద్ద విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగారు. పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత, జూనియర్ కళాశాలల్లో జరిగిన మెగా పేరెంట్, టీచర్ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫోటోలు దిగడంతో పాటు సెల్ఫీలు తీసుకున్నారు. తమ తల్లులకు పాదాలు కడిగి పాదాభివందనం చేశారు. అమ్మకు వందనం పేరుతో మొక్కలు నాటారు. పలు చోట్ల జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లులకు పాదపూజ

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణం, మండలంలోని మండలపరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0లు నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లులకు పాదాలు కడిగి పాదాభివందనం చేశారు. అమ్మకు వందనం పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, విద్యాకమిటీ ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.





కరప: ఉప్పలంక హైస్కూల్‌లో తల్లికి వందనం చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం, పిఠాపురం పాఠశాలలో ఫొటో బూత్‌లో విద్యార్థులతో ఫొటో దిగిన మాజీ ఎమ్మెల్యే వర్మ

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు మెగా పీటీఎం: కలెక్టర్

కాకినాడరూరల్, జూలై10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు మెగా పీటీఎం కార్యక్రమం చక్కని వేదికని కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పీటీఎం 2.0కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగానూ, అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీఐఈవో ఐ.శారద పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశంద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలతో నేరుగా మాట్లాడటంద్వారా వాళ్ల వ్యక్తిత్వం, అభిరుచులు, అలవాట్లు తెలుసుకోవచ్చన్నారు. నవ్యదీపిక అనే విద్యార్థిని గీసిన కలెక్టర్ చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ పిల్లల అలవాట్లు, ప్రవర్తనను తల్లిదండ్రులు పరిశీలిస్తూ ఉండాలన్నారు. అలాగే కలెక్టర్ షాన్‌మోహన్ తూరంగి జడ్పీ పాఠశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

మానవత్వ వికాసానికి గురు విశ్వస్ఫూర్తి ఆధ్యాత్మిక బోధనలు

● ఘనంగా గురు పౌర్ణమి పూజలు

సర్పవరం జంక్షన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మానవత్వ వికాసానికి గురు విశ్వస్ఫూర్తి ఆధ్యాత్మిక బోధనలు దోహదం చేస్తాయని గురు విశ్వస్ఫూర్తి కుటుంబ సభ్యులు, సద్గురు సచ్చిదానంద సద్గురుయోగి, డాక్టర్ వానపల్లి భాగ్యలక్ష్మి సదాశివరావు పేర్కొన్నారు. గురువారం కాకినాడరూరల్ తిమ్మాపురం ప్రజ్ఞఫంక్షన్ హాల్లో స్ఫూర్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మానవత్వం, నైతిక విలు వలు, ఆధ్యాత్మిక భావన పెంపొందించడంలో సైంటిఫిక్ సెయింట్, పూర్ణ గురువుగా విశ్వస్ఫూర్తి బోధనలు విస్తృతంగా ప్రాచుర్యం పొందా యన్నారు.

సామర్లకోట: సామర్లకోటఆంధ్రాసాయి గీతా సమాజం షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచీ జరిగిన విశేష పూజలలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బాబాకు పుష్పార్చన పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు దవులూరి సుబ్బారావు, దన్నాల అప్పారావు, గంగ్రోతుల సత్యనారాయణ, కొప్పన రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి బాబా వారికి ప్రత్యేక పూజలు చేశారు.

కాకినాడరూరల్: రేపూరులోని 116 అడుగుల విరాట్‌సాయిని, కొవ్వాడలోని షిర్డీసాయిబాబాను, రమణయ్యపేట, తిమ్మాపురం, సర్పవరం గ్రామాల్లోని షిర్డీసాయిబాబా ఆలయాలకు తెల్లవారుజామునుంచిభక్తులుదర్శించుకున్నారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.

కొత్తపల్లి: గురుపౌర్ణమి సందర్భంగా ఉప్పాడలో ఐశ్వర్యసాయి ఆలయంలో గురువారం సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లి మండలంలో వివిధ గ్రా మాలకు చెందిన భక్తులు ఐశ్వర్య సాయి ఆల యంలో సాయిబాబాకు పాలాభిషేకం చేశారు.

కాకినాడ సిటీ: స్థానిక 36వ డివిజన్ పెగోడా స్కూల్ ఆవరణలో గురువారం గురుపౌర్ణమి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం జి.సుభాషిణి, మాజీకార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, జనసేన ఇన్‌చార్జి సుంకర సురేష్, విద్యాశాఖ అధికారులుపాల్గొని గురుపౌర్ణమి విశిష్టతను వివరించారు.

కరప: కరప గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో సామూహిక కుంకుమపూజలు నిర్వహించగా పలువురు మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలనంతరం కరప వైస్ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు భక్తులకు భారీ అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. గురజనాపల్లి, నడకుదురు, కొరుపల్లి, కరప, వేళంగి, వాకాడ, కూరాడ, అరట్లకట్ట, పెనుగుదురు, వేములవాడ, తదితర గ్రామాల్లో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

కార్పొరేషన్(కాకిరాడ): కాకినాడ నగరంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. బాబాకి ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవాలయంలోని సాయిబాబా ఆలయంలో బాబా వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 500 మందికి అన్నప్రసాదం అందించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న సాయిబాబా, దత్తాత్రేయ స్వామివారికి గురుపౌర్ణమి సందర్భంగా పంచామృతాభిషేకాలు, అర్చన నిర్వహించారు. స్థానిక పెద్దమార్కెట్ సాయిబాబా ఆలయంలోను, దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురుపౌర్ణమి నిర్వహించారు.

గొల్లప్రోలు: గురుపౌర్ణమి సందర్భంగా గొల్లప్రోలు పట్టణం, మండలంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మెయిన్‌రోడులోని సాయిబాబా ఆలయం, కరణంగారితోటలో గల గొల్లపూడి ట్రస్టు షిర్డిసాయిమందిర్‌లో పూజలు జరిగాయి.

ఓటరు జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకం

● కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జూలై 10(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికలకు సన్నాహంలో భాగంగా కాకినాడ స్మార్ట్ సిటీ హాల్‌లో బూత్ స్థాయి అధికారులుగా ఎంపికైన సచివాలయం, రెవెన్యూ, ఇతర సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ భావన, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ కె.గోవిందరాజు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన, తహసీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని, ఓటరు జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకమని, అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కేటాయించిన పోలింగ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఇళ్లను సర్వేచేసి కొత్త ఓటర్లను నమోదు చేయాలని, ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరిచేయాలన్నారు. అన్నిరకాల విషయాలను యాప్‌లో నమోదుచేయాలని సూచించారు. ఫార్మ్ 6,7,8,6ఎ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

'సాంకేతిక పరిజ్ఞానానికి మత్స్యకారులకు అవగాహన ఉండాలి'

కాకినాడసిటీ, జూలై10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆధునీక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. జాతీయ మత్స్య కృషీవలుల దినోత్సవం స్థానిక జగన్నాధపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ సమావేశ హాల్‌లో గురువారం మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొండబాబు ఈ కార్యక్రమానికి సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అంజలి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొండబాబు, విశిష్టఅతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, విచ్చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్స్యకారులను క్యూ ఆర్ కోడ్‌తో అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీఎన్‌జీజీవో అసోసియేషన్

కరప, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్-గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్(ఏపీఎన్‌జీజీవో) అసోషియేషన్ కరప యూనిట్‌కు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైనట్టుగా ఎన్నికల అధికారి, సంఘ కాకినాడ టౌన్ అధ్యక్షుడు ఎ.సత్తిరాజు తెలిపారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం జరిగిన ఈ ఎన్నికల్లో ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలవడంతో కార్యవర్గమంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యిందన్నారు. సంఘాధ్యక్షుడిగా బీఆర్‌వీ చౌదరి, అసోషియేట్ అధ్యక్షుడిగా కె.వెంకటరత్నం, ఉపాధ్యక్షులుగా యు.వినోద్, ఎస్.ఫణిమురళికృష్ణ, కె.నానిబాబు, కార్యదర్శిగా కె.కేశవరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.కిరణ్‌కుమార్, సీహెచ్.మణికుమార్, పి.వీరభద్రరావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా వి.కామేశ్వరి, కోశాధికారిగా కె.రాఘవకుమార్‌లు ఎన్నికైనట్టు ఆయన తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా డి.రామమూర్తి, ఎన్నికల పర్యవేక్షణాధికారిగా మట్టపర్తి వెంకటేశ్వరరావులు వ్యవహరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గుద్దడి రామమోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు పి.పాండురంగారావు, కార్యనిర్వాహక కార్యదర్శి వై.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీ ఎన్‌జీజీవో కరప యూనిట్ అసోసియేషన్

మెగా పీటీఎంలో ఆకలికేకలు

● ఆలస్యంగా వచ్చిన భోజనాలు

● సగం మందికి సరిపోని పరిస్థితి

గొల్లప్రోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పీటీఎం కార్రక్రమం అన్నిచోట్ల విజయవంతంగా సాగగా, మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఆహార పదార్థాలు సరఫరా చేసే ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాకం తలవంపులు తెచ్చి పెట్టింది. భోజనాలు ఆలస్యంగా రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆకలితో అలమటించగా, ఆహార పదార్థాలు సగం మందికి కూడా సరిపోకపోవడంతో కొన్ని చోట్ల అన్నసంతర్పణలు నుంచి ఉపాధ్యాయులు తెచ్చి సర్దుబాటు చేశారు. మిగిలినచోట్ల ఆకలితోనే ఇళ్లకు వెళ్లాల్సి వచ్చింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు గొల్లప్రోలు పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో గల మండలపరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ సమావేశాలను గురువారం నిర్వహించారు. ఈ సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా తరలివచ్చారు. అనుకున్న రీతితో సమావేశాలు సక్సెస్ కావడంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ముఖ్యఅతిథులతో కలిసి మధ్యాహ్నభోజనం చేయాల్సి ఉండగా, ఆహార పదార్థాలు మాత్రంరాలేదు. మధ్యాహ్న భోజన పథకం సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్వహిస్తున్న ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ అల్లూరి సీతారామరాజు ట్రస్ట్ ప్రతినిధులు నిర్వాకంతో ఉపాధ్యాయులు, ప్రభుత్వం చేసిన కృషి అంతా బూడిదలో పోసిన పన్నీరైంది.

ఈశ్వరతత్వమే మానవత్వం

పిఠాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈశ్వరతత్వమే మానవత్వమని, ఆధ్యాత్మికతత్వంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన సభలో ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉమర్‌ఆలీషా ప్రారంభించారు. 90మంది రక్తదానం చేశారు.

అత్యాధునిక మౌలిక సదుపాయాలతో మెరుగైన వైద్యం

జీజీహెచ్(కాకినాడ) జూలై 10 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులు, చిన్న పిల్లలకు మెరుగైన వైద్య చికిత్సను అందించేందుకు పలు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం హర్షణీయమని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అన్నారు. చైల్డ్ హెల్త్ డెవలప్‌మెంట్ (సీహెచ్‌డీ) గ్రూప్ సహకారంతో ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా సమకూర్చిన రూ.1 కోటి విలువైన నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎన్ఐసీయు)కు సంబంధించిన వైద్య పరికరాలను జీజీహెచ్ పీడీయాట్రిక్స్ లెక్చర్ గ్యాలరీలో గురువారం డాక్టర్ విష్ణువర్ధన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ లావణ్యకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ రూ.25లక్షలు విలువ చేసే అత్యాధునిక హైబ్రీడ్ కన్వెన్షనల్ వెంటిలేటర్, రూ.10లక్షలు విలువచేసే థెరాప్యూటికల్ హైపోథర్మియా పరికరం రూ.5లక్షలు విలువచేసే లామినార్ ఎయిర్ ఫ్లో వర్క్‌స్టేషన్, రూ. 25లక్షల విలువ చేసే సోనోసైట్ ఎడ్జ్-2 అల్ట్రాసౌండ్, రూ.3లక్షలు విలువ చేసే అనలైజర్‌లు, రూ.2 లక్షలు విలువ చేసే పీస్ రిసాసీటేటర్‌లు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ అందించిందని పేర్కొన్నారు. ఈ పరికరాలు ద్వారా చంటిబిడ్డలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, నియోనటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ డి.మాణిక్యాంబ, పీడీయాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ డీఎల్ విద్య, అసోసియేట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ వి.విజయభాస్కర్‌రావు, పీడీయాట్రిక్స్ పీజీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రోజులుగా మంచినీటి సరఫరా బంద్

కొత్తపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు రోజులుగా మంచినీటి పైపు లైన్ లీక్ సరిచేస్తున్నామంటూ సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం ధోరణితో ప్రజలు తాగునీటికి ప్రవేటు వాటర్‌ప్లాంటులను ఆశ్రయిస్తున్నారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో నాగులాపల్లి ఏరియా సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో ప్రధాన పైప్‌లైన్ ఏర్పాటు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంతో గతమూడు రోజుల నుంచి మండలంలో 18 గ్రామాలకు చెందిన 30 శివారు గ్రామాల ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

'తలాటం' మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలి

కాకినాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తలాటం మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పేర్కొన్నారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తలాటం సత్య పుట్టినరోజు వేడుకలను గురువారం స్థాని టుటౌన్ నూకాలమ్మ గుడి ఏరియాలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి తలాటం ఎంతో క్రమ శిక్షణతో పనిచేస్తూ కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దుగ్గన బాబ్జి, ఆకుల శ్రీనివాస్, బడే కృష్ణ, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, నీలపల్లి కామరాజు, చెన్నంశెట్టి భవాని, అట్ల సత్యనారాయణ, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం: ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూలై 10(ఆంధ్రజ్యోతి):పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టపడుతున్నారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. గురువారం సామర్లకోట పట్టణంలో స్టేట్‌బ్యాంకు వెనుక రోడ్డు నుంచి కరపచెరువు, వీర్రాఘవపురం రోడ్డులలో సుపరిపాలన తొలిఅడుగు పేరిట పార్టీ ప్రతినిధులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొని ఇంటింటా పర్యటించి మహిళలకు టీడీపీ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప ఇంటింటికీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు.

వైభవంగా చండీహోమం

పెద్దాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో చండీహోమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆషాఢశుద్ధ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 700 శ్లోకాలతో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పర్యవేక్షణలో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. చండీహోమంలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి పుష్ప పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. ఈకార్యక్రమంలో వేదపండితులు, దేవస్థానం సహాయ కమిషనర్ కురం విజయలక్ష్మీ, రమణ, గద్దే క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత మండలంగా పెదపూడి

పెదపూడి(కరప),జూలై10(ఆంధ్రజ్యోతి):పెదపూడి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నవోదయం 2.0లో భాగంగా తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ పంచాయితీల కార్యదర్శులు,వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గతంలో సారా సహిత గ్రామాలుగా ఉన్నటువంటి ఏపీత్రయంకైకవోలు, గండ్రేడు, కరకుదురు, దోమాడ, పుట్టకొండలను సారారహిత గ్రామాలుగా తీర్మానించిన అనంతరం పెదపూడి మండలంను సారాయి రహిత మండలంగా తీర్మానించి ప్రకటించామని కాకినాడ సౌత్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ టి.నిరంజన్‌రావు తెలిపారు. మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం గూర్చి వివరించి వాటికి సంబందించిన ఏవిధమైన సమాచారం తెలిసినా 14405, ఈగిల్ టీమ్ నెంబర్ 1972లకు సమాచారం తెలపాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు

పిఠాపురంరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. మండలంలోని మంగితుర్తి గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లీశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి లక్ష రూపాయిల విరాళాన్ని ఆయన గురువారం అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలించిన కలెక్టర్

తాళ్లరేవు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశాలు సందర్భంగా కాకినాడజిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆకస్మికంగా గురువారం పర్యటించారు. నామన వెంకాయమ్మ జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించారు. తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను సందర్శించి హెల్త్ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ తీరుపై ఆందోళన

కరప, జూలై 10(ఆంధ్రజ్యోతి): కరప ఫీల్డ్‌అసిస్టెంట్ తీరును నిరసిస్తూ పలువురు ఉపాధిహామీ పథకం శ్రామికులు కరప ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. స్థానిక సిపాయి చెరువులోని పూడికతీత పనులకు గురువారం ఉదయం పలువురు శ్రామికులు వెళ్లారు. ఫీల్డ్‌అసిస్టెంట్ వీరబాబు ఉదయాన్నే వారికి మస్తర్లు వేసి జీపీఎస్‌లో ఫొటో తీసి వెళ్లిపోయాడు. తమకప్పగించిన పని పూర్తయ్యిందని, వచ్చి ఫొటో తీసుకోవాలని సదరు ఫీల్డ్‌అసిస్టెంట్‌కు పలుమార్లు ఫోన్‌చేసినా అతను పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహించిన శ్రామికులు రోడ్డెక్కి నిరసనకు దిగారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఫీల్డ్‌అసిస్టెంట్ తీరును ఎండగట్టారు. పక్షపాతధోరణితో తమను వేధిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఎంపీడీవో అనుపమ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హేమమాధవిలు ఆందోళనకారులతో చర్చించి పనివద్దకు తీసుకెళ్లి ఫీల్డ్‌అసిస్టెంట్‌తో ఫొటో తీయించి పంపడంతో వివాదం సద్దుమణిగింది.

మధ్యవర్తిత్వంతో తక్షణ న్యాయం పొందవచ్చు

పెద్దాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కక్షిదారుల తక్షణ న్యాయం పొందవచ్చని ఏడవ అదనపు జల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి పేర్కొన్నారు. జాతీయ మధ్యవర్తిత్వ వారోత్సవాల సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని గురువారం మాట్లాడారు. మధ్యవర్తిత్వానికి సంబంధించి మెళకువలు నేర్చుకుని, సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు.

'రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు'

తుని రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు అరికట్టడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. హైవే అథారిటీ సిబ్బంది, తుని రూరల్ పోలీసులతో కలిసి హైవేలో ప్రధాన జంక్షన్‌లో జరుగుతున్న ప్రమాదాలకు కారణాలను విశ్లేషించారు. డ్రోన్ సహాయంతో ప్రత్యేక సర్వే నిర్వహించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రభుత్వ పథకాలతో విద్యార్థుల అభ్యున్నతి

-ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి - ఘనంగా పీటీఎం సమావేశాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష, పీవో సింహాచలం

రాజవొమ్మంగి జూలై10(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు అభివృద్ధి చెందేలా ప్రభుత్వం వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గురువారం రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ బాలికల గురుకుల కళాశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ సమావేశానికి ఎమ్మెల్యే శిరీషదేవి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తల్లిదండ్రులు, విద్యార్థుల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు పాల్గొన్నారు.

చింతూరు, (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలంలో గురువారం ఘనంగా మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 108 పాఠశాలల్లో ఈకార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవో జి.వెంకటేశ్వర్లు తెలిపారు. చింతూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా పాల్గొన్నారు.

వై.రామవరం, (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలంలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు పండగలా జరుపుకున్నారు. వై.రామవరం, యార్లగడ్డ, పి.ఎర్రగొండ, బండిగడ్డ, దాలిపాడు, కోట తదితర ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య, జడ్పీహెచ్, ఎంపీపీ పాఠశాలలు, కళాశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. విద్యావ్యవస్థలో ప్రభుత్వం తెచ్చిన మార్పులను, సౌకర్యాలను వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంపీడీవో బాపన్నదొర, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట, ముసినిగుంట, శరభవరం, దేవారం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కృష్ణునిపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు తల్లులకు పాద పూజ చేశారు. కార్యక్రమంలో మరిశెట్ల వెంకటేశ్వరరావు, గేదెల పెద సుబ్బారావు, సిద్దా సత్యనారాయణ, లంకా హరిశ్చంద్రుడు, రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కూనవరం, (ఆంధ్రజ్యోతి): పిల్లలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలని మాజీ జడ్పీటీసీ కన్యకాపరమేశ్వరి అన్నారు. వివిధ పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్స్ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. పిల్లలకు మొదటి గురువులు తల్లిదండ్రులే అన్నారు. పిల్లలను మానసికంగా, శారీరకంగా ఉత్సాహంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు

అడ్డతీగల, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్యాలు ఘనంగా నిర్వహించాయి. అడ్డతీగల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మెగా ఈవెంట్ 2.0 ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ మండల అధ్యక్షుడు జర్తా వెంకటరమణారెడ్డి, జనసేన ప్రోగ్రామింగ్ కమిటీ జిల్లా సభ్యుడు తాటికొండ రాజేంద్ర, ఎస్‌ఎంపీ చైర్మన్ రాధా కృష్ణామూర్తి, బాపనమ్మ పాల్గొన్నారు. స్థానిక ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్న కుమారి పాల్గొని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

వీఆర్‌పురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం కార్యక్రమం నిర్వహించారు. వీఆర్ పురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సాయిరమణ, కూటమి నాయకులు బొర్ర నరేష్‌కుమార్, ముత్యాల సిద్ధార్థ, బొర్ర నరసింహరావు, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎటపాకలో కుంగిన రహదారి



ఎటపాక వద్ద రహదారిపై పడిన గొయ్యి

ఎటపాక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలతో పాటు తెలంగాణ నుంచి ఏపీ మీదుగా వెళ్తున్న ఇసుక లోడ్ లారీల దాటికి ఎటపాక వద్ద రహదారి కుంగి పోయింది. దీంతో రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడింది. పోలీస్ స్టేషన్ సమీపంలోని కల్వర్టు వద్ద రహదారి క్రుంగి ఐదు అడుగుల మేర గొయ్యిగా మారింది. దీంతో భద్రాచలం- చర్ల వైపు వాహన రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొయ్యి పడిన రహదారి వద్ద అప్రమత్తత కోసం స్థానికులు చెట్ల కొమ్మలు పెట్టారు. గొయ్యిని పూడ్చి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

మోతుగూడెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం శ్రీసద్గురు సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజామున కాకడ హారతి ఇచ్చారు. సాయిబాబాకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కె. రాజారావు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు అభిషేకాలు నిర్వహించారు. సోమనేని ఫణికుమార్ ఆధ్వర్యంలో గురుపూజ ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మోతుగూడెం గ్రామ ప్రజలతో పాట ఆంధ్ర, ఒడిశా సరిహద్దులు భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం హారతి, పల్లకీ సేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పీటీ రామారావు, మట్టపర్తి సత్యనారాయణ, పప్పు విశ్వనాథం, కొట్టు శ్రీనివాసరావు, ఈమ్మంది నరసింహమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాఆయుడు, శ్రీను పాల్గొన్నారు

చింతూరు. (ఆంధ్రజ్యోతి): చింతూరు, ఎర్రంపేటలలో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపౌర్ణమి ఘనంగా నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు జరుపుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

'మెడిటేషన్ ఫర్ ద నేషన్'పై అవగాహన

రంపచోడవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'మెడిటేషన్ ఫర్ ద నేషన్'పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.మురళీ గంగాధరరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియేషన్ ఆఫ్ నేషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏఆర్ఆర్ భగవాన్, న్యాయవాదులు యాళ్ల శ్రీనివాసరావు, చుక్కా సంతోష్‌కుమార్, ఎండీఏ జిలానీ, ధర్మల లక్ష్మీనారాయణ, ఎం.రవితేజ, గౌరీశంకర్ పాల్గొన్నారు.

పెరుగుతోన్న గోదావరి

కూనవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శబరి గోదావరి సంఘం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం ఏడు గంటలకు 15 అడుగులకు గోదావరి చేరుకుంది. శుక్రవారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు..

ఘనంగా బోనాల పండుగ

అడ్డతీగల, జూలై10(ఆంధ్రజ్యోతి): వెదురునగరం శ్రీశివసాయి భువనేశ్వరి ఆశ్రమం ఆవరణలో ఉన్న మహంకాళీ అమ్మవార్కి భక్తులు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, దత్త సాయి హోమాలు నిర్వహించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పండుగ వాతావరణంలో 'మెగా పీటీఎం'



కిర్లంపూడిలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, తునిరూరల్: ఎస్.సురవరంలో పేరెంట్స్ మీటింగ్



శంఖవరం మండలం కత్తిపూడిలో జరిగిన ఆటల పోటీలో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

గండేపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. మల్లేపల్లిలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, విద్యాకమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం అన్నపూర్ణ, దిడ్డి చిన్నశ్రీను, పాల్గొన్నారు. యల్లమిల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుంకవిల్లి వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించగా సుమారు రూ.15 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను అందజేసి పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు. అలాగే ఎన్టీరాజాపురంలో నూతనం సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు.

కిర్లంపూడి: కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్కౌట్ విద్యార్థులు గౌరవ వందనం స్వీకరించారు. విద్యాకమిటీ చైర్మన్ ఆళ్ల బాబులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రవేష్, ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, టీడీపీ నేత రామ్‌కుమార్ ఉన్నారు.

ప్రత్తిపాడు: లంపకలోవ, ఒమ్మంగి హై స్కూల్స్‌లలో నిర్వహించిన మెగా పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో డీఈవో పి.రమేష్, ఎంఈవో వి.రాజబాబు పాల్గొన్నారు. ప్రత్తిపాడు జడ్పీ హైస్కూల్లో సమావేశానికి తహశీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎస్ఐ లక్ష్మీకాంతం, ధర్మవరం హైస్కూల్లో సీఐ బి.సూర్యఅప్పారావులు పాల్గొన్నారు.

జగ్గంపేట: విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి మెగా పీటీఎం కార్యక్రమం చక్కని వేదిక అని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. జగ్గంపేట ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మాదారపు వీరబాబు, బుదిరెడ్డి శ్రీనివాస్, కురుమళ్ల నాగేశ్వరరావు, మణికంఠ పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్: ఇర్రిపాక గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణెమ్మ పాల్గొన్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బస్సు చినబాబు, గ్రామ అధ్యక్షులు జ్యోతుల నాగబాబు, బుజ్జి పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని నగర పంచాయతీ చైర్పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. మెగా పేరెంట్స్ సమావేశంలో పట్టణంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించారు. పలు చోట్ల ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలో 64 పాఠశాలలు, కాలేజీల్లో పేరెంట్ మీటింగ్స్ జరిగాయి. ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఆటల పోటీలలో తల్లిదండ్రులు పాల్గొనగా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

కోటనందూరు: కోటనందూరులో లోవ దేవస్థానం మాజీ చైర్మెన్ గాడి రాజుబాబు, కెఇ చిన్నయ్యపాలెంలో మార్కెట్‌కమిటీ చైర్మెన్ అంకంరెడ్డి రమేష్, ఎస్అర్‌పేటలో పోతలసూరిబాబు పాఠశాల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలగా వెంటకృష్ణారావు, షేక్‌నవాబ్‌జానీ, ఎంఈవోలు శ్రీనివాస్, శేఖర్ తదితరులు ఉన్నారు.

తొండంగి: తొండంగి, కేజీబీవీ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్రావు, ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు. విద్యా కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలల్లో పండగ వాతావరణం నడుమ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

తుని రూరల్: ఎన్.సురవరంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ మండలాధ్యక్షుడు, జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత చింతంనీడి అబ్బాయి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హంసవరం మోడల్ స్కూల్‌లో టీడీపీ గ్రామాధ్యక్షుడు కాలిపోయిన గంగారావు, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు మడికిభాస్కర్ సత్యనారాయణ,కాశి పాల్గొన్నారు.



తొండంగి: కెజీబీవీలో మెగా పీటీఎంలో పాల్గొన్న ఎంపీడీవో

పాఠశాలలకు ఆలస్యంగా భోజనం

రౌతులపూడి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ మండలంలోని పాఠశాలలకు భోజనం ఆలస్యంగా అందింది. బెండపూడి నుంచి పాఠశాలకు భోజనం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు అందజేశారు. రౌతులపూడి జిల్లా పరిషత్ పాఠశాలకు వచ్చిన డీఈవో రమేష్ భోజనం నిర్వాహకురాలు, హెచ్‌ఎమ్, ఎంఈవో, చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోనే భోజనం వండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రాజవరానికి 3 గంటలకు భోజనం అందించారు. బంగార య్యపేట గ్రామానికి చెందిన గర్భిణి ఎస్.బోనాలమ్మ తన కొడుకు ఏడో తరగతి చదువుతుండగా సమావేశానికి రాగా భోజనం ఎప్పుడో అందింది.

తల్లిదండ్రులు విద్యావాతావరణాన్ని ప్రోత్సహించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సత్కరిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తమ ఇళ్లలో పిల్లలకు విద్యావాతావరణాన్ని ప్రోత్సహించాలని అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పేర్కొన్నారు. శుక్రవారం దేవస్థానం హైస్కూల్‌లో మెగా పేరెంట్ మీట్ సందర్భంగా దేవస్థానం హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పేరెంట్ మీట్ నిర్వహించారు. ఈవో వీర్ల సుబ్బారావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, అల్లాడ వెంకటేశ్వరరావు, పీఈటీ పర్వత విరేష్, స్కూల్ కమిటీ చైర్మన్ శానపల్లి దేవి, తుమ్మల సత్యేంద్ర, నాయకులు దారా వెంకటరమణ, మెరపల నరసయ్య తదితరులున్నారు.



గండేపల్లి: సాయిబాబాకు పూజలు చేస్తున్న ఆదిత్య అధినేతలు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గండేపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ప్రాంగణంలో షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా పూజలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్య అధినేతలు డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు, వారి కుటుంబీకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, శృతిరెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని బెండపూడి షిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, హారతి, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఏవీ నగరం షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని ఏ కొత్తపల్లి రావికంపాడు, కొమ్మనాపల్లి తదితర గ్రామాల్లో గురుపౌర్ణమిని వేడుకలు నిర్వహించారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రౌతుపాలెంలోని సాయినాథుని ఆలయాన్ని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్ వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్తిపాడులోని శివాలయం, తోటవీధుల్లో సాయిబాబా ఆలయాలు, ధర్మవరంలోని సాయిబాబా ఆలయం వద్ద గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నదానాలు జరిపారు. రౌతుపాలెం ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రామిశెట్టి నాని, జలిగంపల ప్రభాకరరావు, రాసంశెట్టి వీర్రాజు, గొల్లపల్లి కాశీ విశ్వనాద్, సిగిరెడ్డి శ్రీనివాస్, గుణ్ణం వెంకటరమణ, శ్రీనివాస్, దేవర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. వేకువజాము నుంచే సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రౌతులపూడి, బలరామపురం గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లోని షిర్డీసాయి ఆలయాలు కిటకిటలాడాయి.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయిబాబా ఆలయాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో సాయినాథుడికి గ్రామోత్సవం నిర్వహించారు. జగపతినగరం షిర్డీసాయిబాబా ఆలయం వద్ద అన్నదానం చేశారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. మండలంలోని ధర్మవరం అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి సీఐ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీఐ గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్‌ఫోన్‌లు, సోషల్ మీడియా, స్మోకింగ్ తదితర అంశాల వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు చిన రామమూర్తి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ



జగ్గంపేట: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం కామరాజుపేట గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఏడాదిపాలనలో చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలోని మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, సర్పంచ్ అడపా వెంకట్రావు, మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బత్తుల సత్తిబాబు, కామరాజుపేట సొసైటీ చైర్మన్ పీర్ల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అడపా బాబులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వాదేనని టీడీపీ సీనియర్ నాయకుడు మిరియాల శ్రీను చెప్పారు. చినశంకర్లపూడి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే సత్యప్రభ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

బాలికల నూతన వసతిగృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

జగ్గంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయం2 వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల నూతన వసతిగృహాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. తరగతి గదులను ఎస్వీఎస్ అప్పలరాజు, విశ్రాంతి గదును జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, వంటశాలను మారిశెట్టి భద్రం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. బాలికలకు వసతి సముదాయాన్ని ఏర్పాటు చేసినందుకు హాస్టల్ వార్డెన్ రోజా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రామవరం ఇందిరా యానాదుల కాలనీలో సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో వారికి ఇక్కడ నూతన వసతిగృహం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వై.వాణి, ఎండీవో చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోదిరెడ్డి శ్రీనివాస్, వేములకొండ జోగారావు, ఈవోపీఆర్డీ భాస్కరరావు, హాస్టల్ వార్డెన్స్ రోజా, ప్రభాకర్, నండ్ల చిరంజీవి, రాయి సాయి, పంచాయతీ సెక్రటరీ శివ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సొసైటీ చైర్మన్లు

గండేపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండేపల్లి, జడ్.రాగంపేట, మల్లేపల్లి, నాయకంపల్లి సొసైటీ చైర్మన్లు నూతనంగా నియమితులైన కంటిపూడి సత్యనారాయణ, కందుల కొండయ్యచౌదరి, దిడ్డి శ్రీను, పాలకుర్తి ఆదినారాయణ గురువారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. చైర్మన్లతో పాటు సొసైటీ త్రిసభ్య కమిటీ డైరెక్టర్లు గొల్లవిల్లి అన్నవరం, కంటిపూడి రామారావు, మద్దిపాటి రాంబాబు, వైబోగుల వెంకటేశ్వర్లు, వెలిది సుబ్రహ్మణ్యం, ఇల్లంకల నాయుడు, కుంచే రామకృష్ణ, బొక్కం సత్యనారాయణ ఎమ్మెల్యేను కలిశారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం వారిని ఎమ్మెల్యే నెహ్రూ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, అడబాల భాస్కరరావు, కందుల చిట్టిబాబు, కేతిన వెంకన్నచౌదరి, బొల్లంరెడ్డి రామకృష్ణ, బొండా శ్రీనుబాబు, కాటేపల్లి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా పైడిరాజు బాధ్యతలు స్వీకరణ

రౌతులపూడి, జూలై 10(ఆంధ్రజ్యోతి) రౌతులపూడి సొసైటీ అధ్యక్షుడిగా పైల పైడిరాజు గురువారం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా తంటపురెడ్డి అప్పారావు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ఎంపీటీసీ సోమరౌతు రవి, కోరుప్రోలు సత్తిబాబు, కోటిపల్లి నాగు, యగదాసు నాగేశ్వరరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విదుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. రాజపూడి హెడ్ క్వార్టర్స్ ఫీడర్, 11కేవీ జగ్గంపేట, నరేంద్రపట్నం ఫీడర్ పరిధిలో చెట్లు నరికివేత, మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

కోటనందూరు: కోటనందూరు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని ఏఈ వీరభద్రరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవి టిజెనగరం, కెఇ చిన్నయ్యపాలెం ఫీడర్ల మరమ్మతుల కారణంగా టి.జెనగరం, బొద్దవరం ఇందుగపల్లి, తిమ్మరాజుపేట, కెఎస్‌కొత్తూరు, పికొట్టాం, కెకొట్టాం, ఎల్‌డిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని ఆయన చెప్పారు.

రత్నగిరిపై వ్యాసపౌర్ణమి

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వ్యాసపౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసభగవానుడి విగ్రహాన్ని తిరుచ్చిపై ఆశీనులు గావించి పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ముమ్మరు ప్రదక్షిణ గావించారు.

తిరుమల బ్రేక్ దర్శనాల పేరుతో డబ్బులు వసూలు

పోలీసులకు ఫిర్యాదు

జగ్గంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బ్రేక్ దర్శనాలకు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబరు, జ్యోతుల నెహ్రూ లేఖను ఇప్పిస్తానని డబ్బులు చేస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వంశీ అనే వ్యక్తి కొంతమందికి ఫోన్ చేసి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు ఇప్పిస్తానని రూ.50వేలు వసూలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయానికి సమాచారం అందింది. అతడు 888 5866551, 90677 88767 నంబర్లతో ఫోన్ చేస్తున్నాడు. దీనిపై ఎమ్మెల్యే పీఏ శివప్రసాద్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో వంశీ పేరుతో ఎవరూ పనిచేయడం లేదని, ఇటువంటి మోసగాళ్ల వలలో పడొద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

బడ్డీ షాపుల తనిఖీ

తుని రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తుని రాజా హైస్కూలు, హైస్కూల్ ఫర్ గర్ల్స్‌కి చుట్టుపక్కల ఉన్న బడ్డీ షాపులను పోలీసులు తనిఖీ చేశారు. గుట్కాలు, ఖైనీ, సిగరెట్లు, పాన్ చాక్లెట్స్ సీజ్ చేసి 11 మంది షాపు యజమానులకు రూ.200 చొప్పున జరిమానా విధించారు. విద్యాసంస్థలకు చుట్టుపక్కల ఉన్న షాపుల్లో మద్యం, గుట్కాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా శేషారావు ప్రమాణ స్వీకారం

ప్రత్తిపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా గురువారం దాసం శేషారావు పదవీ బాధ్యతలు చేపట్టారు. పర్సన్‌లుగా సీహెచ్ అప్పలరాజు, పంపనబోయిన తాతాజీలతో కలిసి చైర్‌పర్సన్ శేషారావు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడారు. రైతులకు తక్కువ వడ్డీపై రుణాలు, మార్కెటింగ్ సహకారం వంటి అంశాలపై కార్యాచరణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, ఊటా వీరబాబు, పుణ్యమంతుల శ్రీను, తోపాటి నూకరాజు,అమరాది శేషరావు, సిద్ధపురెడ్డి గణేష్, రైతు సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.